## పౌరాణిక గాథ

# మణిద్వీపవాసిని



**టి.కళ్యాణి**

"యాదేవీ! సర్వభూతేషు మాతృరూపేణ సంస్థితా!
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః!!
యాదేవీ! సర్వభూతేషు శక్తిరూపేణ సంస్థితా!
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః!!"

పవిత్ర నైమిశారణ్య ప్రాంతం దేవీ మంత్రోచ్ఛాటనతో ప్రతిధ్వనిస్తున్నది! అది ఆశ్వయుజమాసం, పాడ్యమి తిథి! దేవీ నవరాత్రోత్సవాల ప్రథమదినం! శౌనకాది మునులు శుచిర్భూతులై సమప్రదేశంలో పదహారు హస్తాల మానము, ఏడు హస్తాల వెడల్పు, తొమ్మిది హస్తాల పొడవు వుండేలా వేదిక యేర్పాటు చేసారు! పూలమాలలతో, మామిడాకు తోరణాలతో అలంకరించి వేద మంత్రాలు పఠిస్తూ దానిపై దేవీ విగ్రహాన్ని ప్రతిష్ట కావించారు!

అష్టాదశ (పద్ధెనిమిది) భుజాలతో, వివిధ ఆయుధాలు ధరించి సింహవాహనం మీద కొలువైన దేవీమాత జాజ్వల మానంగా వెలుగుతూ పూజలందుకోవడానికి, సర్వశుభాలు ప్రసాదించడానికి సంసిద్ధంగా వున్నట్లు మందహాస వదనారవిందంతో దర్శనమిస్తున్నది! దేవీమాత విగ్రహం ముందు పూర్ణకలశాన్ని, ఆ ప్రక్కనే దేవీ బీజాక్షర సహితమైన నవార్ణ మంత్రం - 'ఐంహ్రీం క్లీం చాముండాయై విచ్చే' అని లిఖించిన రాగిరేకును స్థాపించి కలశంపై దేవిని ఆవాహన చేసి విధి విధానంగా పూజ ప్రారంభించారు.

"ఓం ఐంహ్రీంక్లీం శ్రీమాతాయైనమః శ్రీమహారాజ్ఞైనమః!
ఓం చిదగ్నికుండాంత సంభూతాయై నమః.."

పుష్పాలు, కుంకుమ సమర్పిస్తూ దేవీ సహస్ర నామావళి చదువుతున్నారందరూ భక్తిశ్రద్ధలతో ఆ మాత మీద మనస్సు నిలిపి!

ముని సమాజం మధ్య కూర్చుని పూజా కార్యక్రమాన్ని కన్నుల పండుగగా వీక్షించారు దేవ ఋషి నారద మునీంద్రులు!

"ఆహా! నా జన్మధన్యమైంది! పవిత్రమైన, పరమపావనమైన నవరాత్రోత్సవాలలో పాల్గొనే అదృష్టం లభించింది!

'మోక్షదాంచ ముముక్షూణాం, కామదాంచ ఫలార్థినాం!
త్రిగుణాతీత రూపాంచ గుణ విస్తార కారకాం!
నిర్గుణాం సగుణా తస్మాత్తాంధ్యాయన్తి ఫలార్థినః!!

ఇహపర సౌఖ్యాలు ప్రసాదించే జగన్మాత కరుణార్ద్ర వీక్షణాలు ఎల్లప్పుడు మనందరిని కాపాడుతూ వుండాలని ప్రార్థిద్దాం!" అన్నారు భక్తిగా నమస్కరిస్తూ!

"నారద మహర్షి! మీరిలా రావడం మా భాగ్యంగా భావిస్తున్నాము! యమదంష్ట్రికలవంటి శరద్వసంత ఋతువులలో భూలోకంలో ప్రజలు ఈతిబాధలతో, వివిధ రోగాలతో, కరువుకాటకాలతో పీడించబడుతుంటారు. అటువంటి విపత్కర పరిస్థితులు రాకుండా లోకం సుభిక్షంగా, సుఖశాంతులతో విలసిల్లడానికి దేవీ నవరాత్రోత్సవాలు జరిపి జగన్మాతను ఆరాధించడం తరుణోపాయంగా వేదాలు ఘోషిస్తున్నాయి. ముఖ్యంగా శరన్నవరాత్రులలో ఎందరో దుష్టరాక్షసులను సంహరించి, అధర్మాన్ని రూపుమాపి ధర్మకేతనాన్ని ఎగరవేసిన ఆ జగన్మాత లీలా విశేషాలు మీరు వివరిస్తే వినాలని ఆశిస్తున్నాం! మా కోర్కె మన్నించండి!" అంటూ ప్రార్థించారు శౌనకాది మునులు వెళ్లడానికి వుద్యుక్తుడైన నారదమునిని వారిస్తూ!

"అంతా ఆ దేవి సంకల్పంగా భావిస్తున్నాను. మీరిలా అడగటం నాకెంతో ఆనందం కలిగిస్తున్నది. దేవి చరితాన్ని ఎన్నిసార్లు విన్నా, మననం చేసినా తనివి తీరదు కదా! అందుకే ఆ జగన్మాత లీలా వినోదంలో ముఖ్యమైన ఘట్టాన్ని వివరిస్తాను. వినండి" అంటూ చెప్పసాగారు నారదమునీంద్రులు.

☆ ☆ ☆

దేవరాజు ఇంద్రుని సభాభవనం జయజయ ధ్వానాలతో ప్రతిధ్వనిస్తున్నది. స్వర్గలోకమంతా ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. దేవదానవ యుద్ధంలో విజయాన్ని పొంది తిరిగి వచ్చారు ఇంద్రుడు, అష్టదిక్పాలకులైన అగ్ని, వరుణుడు, వాయువు మొదలైన సురప్రముఖులు. రంభాద్యప్సరసలు పూలమాలలతో స్వాగతం పలికి కనుల విందుగా నృత్యగానాలు ఆరంభించారు. శచీదేవి సహితంగా సింహాసనాన్ని అలంకరించిన ఇంద్రుని హృదయం ఆనందంతో, గర్వాహంకారాలతో వుప్పొంగిపోయింది.

"సురప్రముఖులారా! మన ధాటికి ఎదురు నిలవలేక అసు



రులు పాతాళానికి తరలిపోయారు. అమృతసేవనంతో జరామరణాలు లేని మనలను ఇకపై కన్నెత్తి చూసే సాహసం చేయరు. భూలోకవాసులకు అసురభయం లేకుండా చేసాం! మనమీద కృతజ్ఞతా భావంతో, భక్తితో యజ్ఞయాగాలు చేస్తూ హవిర్భాగాలు సమర్పిస్తూ వుంటారు. అవును కదూ?" అన్నాడు అందరివైపు కలయచూస్తూ! అతని పలుకుల్లో ధ్వనిస్తున్న స్వోత్కర్షకు వంతపాడుతూ "అవును దేవేంద్రా! ఇక మూడు లోకాలలో మిమ్మల్ని ఎదిరించి, నిలిచే సాహసం ఎవరూ చేయరు. మీ బాహుబలం, వజ్రాయుధాల ముందు ఆ అసురుల బలం ఏపాటి?" అన్నారు దేవతలందరూ ముక్త కంఠంతో. ఆ ప్రశంసాపరంపరకు అవరోధం కలిగిస్తూ సభామందిరం వింతైన ధ్వనితో దద్దరిల్లింది. కోటి విద్యుల్లతలకాంతితో వెలుగుతూ ఒక దివ్యతేజం ఆవిర్భవించింది వారి ఎదుట! ఆ తేజాన్ని చూడలేక కన్నులరమోడ్చి కలవరంతో "ఏమిటీ వుత్పాతం? ఎవరు సృష్టించారు?" అంటూ సింహాసనం మీద నుండి లేచాడు దేవేంద్రుడు.

"ఇంద్రా! నిన్ను మించిన బలాధికుడు లేదని బీరాలు పలుకుతున్నారే ఇక్కడందరూ. ఏదీ ఈ గడ్డిపోచను కదిలించు చూస్తాను, నీ శక్తిసామర్థ్యాలెంతటివో" అన్న పలుకులు వినిపించాయి. ఆ దివ్యప్రభ నుండి పచ్చగా మెరుస్తున్న గడ్డిపోచ ఒకటి నిలిచింది ఇంద్రుని పాదాల దగ్గర.

దాని వైపుతృణీకారంగా చూస్తూ "ఇదేదో రాక్షసమాయలాగా వున్నది! ఈ గడ్డిపోచను నేను, త్రిలోకసార్వభౌముడిని కదల్చి చూపాలా? అగ్నిదేవా! విన్నావా ఆ అశరీరవాణి పలుకులు?" అన్నాడు దేవేంద్రుడు. "విన్నాను సురేంద్రా! ఈ చిన్న పని మీరు చేయాలా! లోకాలన్నీ కాల్చి భస్మం చేయగలశక్తిమంతుడిని నేనుండగా మీకెందుకు శ్రమ" అంటూ ముందుకు వచ్చి తేలికగా గడ్డిపోచవైపు చూస్తూ దాన్ని దహించడానికి ప్రయత్నించి విఫలుడైనాడు అగ్నిదేవుడు. అతని తర్వాత అట్టహాసం చేస్తూ వచ్చిన వాయువుగానీ, ఇతర దిక్పాలకులుగానీ ఏమీ చేయలేకపోయారు ఆ తృణాన్ని.

చివరకు భయంతో, అనుమానాస్పదంగా గడ్డిపోచను చూస్తూ కదల్చడానికి ప్రయత్నించి విఫలుడైనాడు ఇంద్రుడు కూడా.

"దేవతలారా! ఏమిటది? ఇంతవరకూ మీ బలపరాక్రమాలను పొగడుకుంటున్న మీలో ఒక తృణాన్ని కదిలించే శక్తి లేదా? శక్తిరహితులైన మీ ఉనికికి అర్థమేమిటి?" అన్న పలుకులు వినిపించడంతో దేవతలతో అంతవరకు వుండిన గర్వాహంకారాల పొరలు విడిపోయాయి.

"ఓ దివ్యతేజమా! గర్వాహంకారాలతో మాయా మోహితులమైన మాలోని అజ్ఞానాంధకారాన్ని పారద్రోలటానికి ప్రత్యక్షమైన నీకివే మా శతకోటి ప్రణామాలు. మా పై దయ చూపి ఈ దుర్నిరీక్షణమైన వెలుగులోని శక్తిని దర్శించే భాగ్యం కలిగించు" అంటూ ప్రార్థించారు దేవతలు. వాళ్ల ప్రార్థన మన్నించినట్లు ఆ తేజోమండల మధ్యంలో దర్శనమిచ్చింది దేవీమాత.

"తేజోమండల మధ్యేతు కుమారీం నవయౌవ్వనాం!
భాస్వజ్జపా ప్రసూనాభాం బాలకోటి రవి ప్రభాం!!
బాలశీతాంశు ముకుటాం వస్త్రాంతర్వ్యం జితస్తనీం!
చతుర్భిరహ హస్త్యైస్తు వరపాశాంకుశాభయాన్!!
దధానాం రమణీయాంగ కోమలాంగ లతాం శివాం!
భక్త కల్పద్రుమామంబాం నానా భూషణ భూషితాం!!
నిర్వ్యాజ కరుణామూర్తిం సర్వకారణ కారణాం!
దదర్శ వాసవస్త్సత్ర ప్రేమ సద్గతి తాన్తరః!!"

తేజోమండల మధ్యంలో సుందర సౌమ్యరూపంతో, భక్తులపాలిట కల్పవృక్షంలా సర్వాలంకార శోభితయై, కన్నుల నుండి అపారకరుణామృత వీక్షణాలు ప్రసరింపజేస్తూ కానవచ్చిన దేవీమాతకు భక్తితో ప్రణమిల్లారు ఇంద్రాది దేవతలు.

"మాతా! సృష్టి సర్వస్వంలో, మాలో శక్తిరూపిణివై నిలిచివుండే నీ కరుణ లేక తృణం కూడా చలించలేదని నిరూపించి మాలోని అజ్ఞానాన్ని రూపుమాపావు! గర్వాహంకారాలు విడిచి నిర్మలహృదయంతో నిన్ను సేవించి, తరించే భాగ్యం ప్రసాదించు" అని వేడుకున్నారు.

☆ ☆ ☆

"శౌనకాది మునులారా! దేవతల భాగ్యవశాన దేవీమాత సాక్షాత్కరించి, వారి గర్వాన్ని పరిహరించి, వాళ్లలో జ్యోతిరూపంలో వెలుగుతూ శక్తిని ప్రసాదించి, సర్వకా

ర్యాలు నిర్వర్తించే సమర్థత తన సంకల్ప మాత్రం చేత జరుగుతున్నదని ఉపదేశించి అంతర్ధానమై తన స్వీయస్థానం మణిద్వీపాన్ని చేరి చింతామణి గృహంలో విరాజితురాలైంది!" అంటూ ఆ దృశ్యాన్ని తలచుకుంటూ ఆపాదమస్తకం భక్తిపారవశ్యంలో మునిగి ధ్యాన నిమీలిత నేత్రాలతో చెప్పటం ఆపాడు నారదుడు!

"దేవర్షి! సత్యలోకం, కైలాసం, వైకుంఠ పురాల గూర్చి వినివున్నాం! దేవీమాత స్థానమైన మణిద్వీపం గూర్చి వివరంగా చెప్పండి!" అంటూ కుతూహలంగా ప్రశ్నించారు మునిగణాలు.

"మునివర్యులారా! త్రిమూర్తుల లోకాలకు ఊర్ధ్వస్థానంలో వాటిపై ఛత్రంలా ఆచ్ఛాదన చేస్తూ సుధా సముద్ర మధ్యంలో విరాజమానమై వుంది మణిద్వీపం! అన్ని లోకాలు దానిలోనే అంతర్భూతంగా వెలసివుండటంతో సర్వలోకమని కూడా నామాంతరం వున్నది! నిరంతరం శక్తి ఉపాసన చేస్తూ, దేవీ బీజాక్షర మంత్రోపాసన చేసే నిష్ఠాగరిష్ఠులైన యోగిపుంగవులకు మాత్రమే మణిద్వీపదర్శన భాగ్యం లభిస్తుంది!



ఏడు ఊర్ధ్వలోకాలు, భూమి, ఏడు పాతాళాది అథోలోకాలు కలిసి ఒక బ్రహ్మాండమని ఎరుగుదురు గదా! ఇటువంటి అనేక బ్రహ్మాండాలను సృజించిన దేవీమాత 'అనేక కోటి బ్రహ్మాండ జనని'గా త్రిమూర్తుల చేత, దేవతలు, ఋషిగణాలచేత కీర్తింపబడుతూ మణిద్వీపంలో విరాజిల్లుతూ 'మణిద్వీపవాసిని'గా పూజలందుకుంటున్నది. మునులారా! మణిద్వీపం చుట్టూ ఎన్నెన్నో ప్రాకారాలు వెలసి వున్నాయి. లోహమయ, రజిత, స్వర్ణ ప్రాకారాలు మందార, కదంబ, పారిజాత, కల్ప వృక్ష సముదాయాల మధ్య నిర్మితమై వున్నాయి. వాటిలో వేత్ర హస్తులై దేవతలు, ఋతువులకధి నాయకులు నివసిస్తూ మణిద్వీపాన్ని అప్రమత్తతతో కాపలా కాస్తుంటారు. ఆ ప్రాకారాలు దాటిన తర్వాత అష్టదిక్పాలకుల పురాలు ప్రతిష్ఠమై వున్నాయి. పుష్పరాగమణులతో దేదీప్యమానంగా వెలిగే ఆ పురాల వైభవం వర్ణనాతీతమైనది. వాటికవతల పద్మరాగమయమైన మణిమండపాలలో అరవై నాలుగు శక్తిరూపాలు అగ్నిజ్వాలలు కురిపిస్తూ భీకర రూపాలతో మణిద్వీపానికి అభేద్య కవచంలా వెలుగుతూ వుంటాయి. ఆ మండపాల కావల గోమేధికమణిమయమైన ప్రాకారాలలో దేవికి సైన్యాధ్యక్షులనబడే ముప్పై రెండు మహాశక్తులు విలసిల్లుతుంటాయి. ఆ ప్రాకారాల కావల వజ్రాలు, వైఢూర్యాలు పొదగబడి ధగధగ కాంతులీనే ప్రాకారాలలో దేవీమాత పరిచారిక బృందాలు దేవి అంశలైన అష్టమాతృకలను-బ్రాహ్మీ, మహేశ్వరి, కౌమారి, వైష్ణవి, వారాహీ, ఇంద్రాణి, చాముండి, మహాలక్ష్మి అనే పేర్లతో పూజిస్తూ వుంటారు. దేవీమాత వాహనాలన్నీ ఈ ప్రాకారంలోనే సేవకు సంసిద్ధంగా నిలిచివుంటాయి. ఈ ప్రాకారాల కవతల పదహారు దళాలతో విలసిల్లే ఇంద్రనీలమణి ప్రాకాంలో దేవి షోడశకళలు, ఆపైన ముక్తామణుల ప్రాకారంలో దేవీమాతకు సర్వకార్యాలు వివరించే అష్టమంత్రిణుల సముదాయం విరాజమానమై వుంటాయి. ఆపైన మరకత మణులతో దేదీప్యమానంగా వెలుగొందుతుండే ప్రాకారంలో త్రిమూర్తుల లోకాలు సుప్రతిష్ఠమై వున్నాయి. వాటి తర్వాత పగడాల ప్రాకారంలో అవరణ దేవతలు దేవీమాతను పరివేష్టించి వుంటారు. ఆ ప్రాకారాన్ని దాటిన తర్వాత చింతామణి నిర్మితమైన సువిశాల ప్రాకారంలో శృంగార, ముక్తి, జ్ఞాన, ఏకాంతాలనే నాలుగు స్తంభాల మధ్య జాజ్వలమానంగా వెలుగొందుతున్న పర్యంకం మీద సుఖాసీనురాలై మణిద్వీపవాసిని జగన్మాత విరాజిల్లుతూ వుంటుంది.

శౌనకాది మునులారా! ఆ చింతామణి ప్రాకారం అన్ని వైపులా అమృతధారలు వర్షిస్తూ వుంటాయి. ఆ ప్రాకారమధ్యంలోని పర్యంకానికి పది శక్తితత్వాలనే సోపానాలు వున్నాయి. ఆ సోపానాల నధిరోహించి బ్రహ్మ, విష్ణు, రుద్ర, ఈశ్వరులే నాలుగు ఆధార స్తంభాలుగా వెలసిన పర్యంక్యం మీద ఆసీనురాలై దేవీమాత లోకాలను పరిరక్షిస్తూ వున్నది.

దేవీ నవరాత్రులలో ఈ మణిద్వీప వర్ణనను విని, ఆ మణిద్వీపవాసినిని ఆరాధించే వారికి సర్వశుభాలు చేకూరుతాయి. పరమదుర్లభమైన ఆ దేవి ఆవాసాన్ని పూజించి తరించడానికనువుగా మాత కరుణతో ప్రసాదించిన 'శ్రీచక్రం' మణిద్వీపానికి ప్రతిరూపంగా గ్రహించండి. మంత్రయుక్తంగా, నియమనిష్ఠలతో శ్రీచక్రాన్ని ఉపాసించే వారికి మణిద్వీపవాసిని ఇహపర సౌఖ్యాలు ప్రసాదిస్తుంది. సర్వపాపాలు పరిహరించి ముక్తిని అనుగ్రహిస్తుంది" అంటూ వివరించారు నారదమహర్షి.

"మీ నోట మణిద్వీప వర్ణనం విని మా జన్మలు ధన్యమైనాయి మునీంద్రా! నవరాత్ర వ్రత దీక్ష పూనిన మేమంతా ఆ చరితాన్ని మననం చేసుకుంటూ పులకించిపోతాము! మహిషాసురుడశుంభుని శుంభులు మొదలైన దానవులను దేవి వధించిన చరితాలు మరోసారి చదివి పునీతులమౌతాము. దేవీమాత అనుగ్రహంతో రామచంద్రుడు రావణ వధ కావించిన విజయదశమి పర్వదినాన పూర్ణాహుతి సమర్పించి యాగ పరి సమాప్తి కావిస్తాము. ఉపవాస దీక్ష వహించి, భూమిపైనే శయనిస్తూ యధాశక్తితో ఆ దేవిని ఆరాధించుకుంటాము. దేవికి ప్రీతికరమైన 'కుమారీ పూజ' అష్టమినాడు తప్పక నిర్వహిస్తాము. రెండు సంవత్సరముల మొదలు పది సంవత్సరాలు దాటిన ఆరోగ్యవంతులైన బాలికలను ఆ దేవి ప్రతిరూపాలుగా భావించి పూజించడం వల్ల సర్వశుభాలు కలుగుతాయి గదా!" ఉత్సాహంగా చెబుతున్న ముని సమాజం వైపు ప్రసన్నంగా చూస్తూ "శుభం! ఆ దేవీమాత అనుగ్రహం ఎల్లప్పుడూ అందరిపై వర్షిస్తూ వుండాలని ఆశిస్తున్నాను.

*'ఈశ్వరీ సర్వభూతానాం సర్వకారణ కారణం!*
*సర్వకామార్థ దా శాంతా సుఖ సేవ్యాదయాన్వితా!!'*
*జగన్మాత మణిద్వీపవాసినికివే నా శతకోటి ప్రణామాలు!"*

అంటూ అంజలి ఘటించారు నారద మునీంద్రులు!!

ఓం శాంతిః శాంతిః శాంతిః